శుక్రవారం 10-01-2025

# ముందడుగు

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

సంపుటి: 1, సంచిక: 548 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

## సీఎం విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

- జనవరి 13 నుంచి 23 వరకు పర్యటన

2 లో



## ఆరున్నర గంటల పాటు విచారించిన ఏసీబీ

- ఎప్పుడు పిలిచినా హాజరుకావాలని సూచన
- పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా
- నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు..
- ఏసీబీవిచారణ అనంతరం మీడియాతో కేటీఆర్



2 లో

## తిరుపతి ఘటనలో ఇద్దరు అధికారులు సస్పెండ్

- డీఎస్పీ బాధ్యత లేకుండా పనిచేశారు
- ఎస్పీ,జేఈవో, సీఎస్‌వో తక్షణమే బదిలీ
- తిరుమలలో సీఎం చంద్రబాబు సమీక్ష



2 లో

## ఢిల్లీ అభివృద్ధిపై బిజెపికి విజన్ లేదు

- బూతులు మాట్లాడే పార్టీకి ప్రజలు ఓటెయ్యరు
- ఎవరిని ఎన్నుకోవాలనే ప్రజలకు తెలుసు
- బిజెపిపై ఢిల్లీ సీఎం విమర్శనాస్త్రాలు



3 లో

## భూ భారతి-2024 చట్టానికి గవర్నర్ ఆమోదం

వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తాం..

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

2 లో



## ఉచితాలు కావాలా.. మెరుగైన సౌకర్యాలా..

- 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగఢియా

3 లో



## ప్రజలకు దత్తత ఇవ్వనున్న రిటైర్డ్ జాగిలాలు

సీఆర్పీఎఫ్ కీలక నిర్ణయం



3 లో

ముందడుగు
శుక్రవారం
10-01-2025
హైదరాబాద్

### ఆరున్నర గంటల పాటు
# విచారించిన ఏసీబీ

ముందడుగు తెలంగాణ

తెలంగాణ ఫార్ములా-ఈ రేసు కేసులో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు 6.30 గంటల పాటు విచారించారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్ కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు సూచించారు.

ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా" అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు.

### సీఎం విదేశీ పర్యటనకు
# ఏసీబీ కోర్టు అనుమతి

ముందడుగు తెలంగాణ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.

### తిరుపతి ఘటనలో
# ఇద్దరు అధికారులు సస్పెండ్

ముందడుగు తిరుమల

తిరుమల తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై తితిదే పరిపాలన భవనంలో సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎస్పీ రమణకుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్ రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం"

### భూ భారతి-2024 చట్టానికి
# గవర్నర్ ఆమోదం

ముందడుగు తెలంగాణ

తెలంగాణలో 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర పడటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రూపొందించామని పేర్కొన్నారు.

ముందడుగు
శుక్రవారం 10-01-2025 హైదరాబాద్

## మయన్మార్‌లో
# సైన్యం దురాగతాలు

### ఓ గ్రామంపై వైమానిక దాడులు

### 40మంది మృతి.. 20మందికి పైగా గాయాలు



ముందడుగు జాతీయం

మయన్మార్ సైన్యం దురాగతాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే అనేకమందిని పొట్టనబెట్టుకున్న అక్కడి సైన్యం తాజాగా ఓ సాయుధ మైనార్టీ గ్రూపు ఆధీనంలో ఉన్న గ్రామంపై వైమానిక దాడులకు తెగబడింది. ఈ ఘటనలో కనీసం 40మంది మృతిచెందగా.. 20మందికి పైగా గాయపడినట్లు స్థానిక స్వచ్ఛంద సంస్థ అధికారులు వెల్లడించారు. పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో రామ్రీ ద్వీపంలో అరకాన్ ఆర్మీ ఆధీనంలో ఉన్న క్యాక్ నీ మావ్ అనే గ్రామంపై జరిగిన దాడుల్లో వందలాది ఇళ్లు ధ్వంసమైనట్లు తెలిపారు.

దీంతో అక్కడ తీవ్ర విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఆ గ్రామంలో ఇంటర్నెట్ సర్వీసులు, సెల్‌ఫోన్ సేవలను మాత్రం నిలిపివేశారు.

## ఢిల్లీ అభివృద్ధిపై బిజెపికి
# విజన్ లేదు

ముందడుగు ఢిల్లీ

ఢిల్లీలో జరగబోయే ఎన్నికలు ఆమ్ ఆద్మీపార్టీకి, దుర్భాషలాడే సమూహానికి మధ్య జరుగుతున్నాయని భాజపాని ఉద్దేశించి సీఎం ఆతిశీ.. ప్రతిపక్ష భాజపాపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని భాజపా విమర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆమె ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. 'ఆతిశీ తన తండ్రిని మార్చేశారు' అంటూ ఇటీవల భాజపా మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ చేసిన వ్యాఖ్యలను ఆమె ప్రస్తావించారు. బూతులు మాట్లాడేవారిని, ఆ పార్టీని ప్రజలు ఎన్నుకోబోరని, ఎవరైతే తమ కోసం పని చేస్తారో వాళ్లకే ఓటు వేస్తారని అన్నారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే విషయాన్ని పదేపదే చెబుతారని ఆమె గుర్తు చేసుకున్నారు.

ఢిల్లీ అభివృద్ధిపై భాజపాకు ఓ విజన్ లేదని ఆతిశీ అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాదు కాబట్టే.. ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ప్రకటించలేదని ఎద్దేవా చేశారు.

## ఉచితాలు కావాలా..
# మెరుగైన సౌకర్యాలా..

ముందడుగు జాతీయం

దేశంలోని ప్రజలను ఉద్దేశిస్తూ ప్రముఖ ఆర్థికవేత్త, 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగఢియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉచితాలు కావాలా లేదా మెరుగైన సౌకర్యాలు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం కేటాయించిన నిధులను రాష్ట్రాలు ఉచితాల కోసం వినియోగిస్తున్నాయనే ఆరోపణలపై స్పందించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "అభివృద్ధి ప్రాజెక్టుల కోసం కేటాయించిన డబ్బును ఆ పనులకు మాత్రమే వినియోగించాలి. అయితే.. ఈ డబ్బును ఎలా ఖర్చు చేయాలనే తుది నిర్ణయం మాత్రం ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రభుత్వానిదే. ఫైనాన్స్ కమిషన్ దీనికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కాకపోతే.. స్థూల ఆర్థికస్థిరత్వం ప్రయోజనాల దృష్ట్యా సమస్యకు సంబంధించిన అంశాన్ని లేవనెత్తవచ్చు. అంతే తప్ప రాష్ట్రాలు ఆ మొత్తాన్ని ఎలా ఖర్చు చేయాలో నియంత్రించే అధికారం కమిషన్‌కు లేదు" అని విలేకరుల సమావేశంలో ఎదురైన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

## ప్రజలకు దత్తత ఇవ్వనున్న
# రిటైర్డ్ జాగిలాలు

ముందడుగు జాతీయం

దేశం కోసం పనిచేసి రిటైర్డ్ అయ్యి విశ్రాంతి తీసుకుంటున్న జాగిలాల విషయంలో సీఆర్పీఎఫ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వీటిని ప్రజలు దత్తత తీసుకునేలా వీలు కల్పిస్తోంది. అందుకు వీలుగా ఆన్‌లైన్ సేవలను ప్రారంభించింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్రాల పోలీసులు తమ వద్ద రిటైర్డ్ అయిన శునకాలను.. సంరక్షణ కేంద్రాలు, రిజిస్టర్డ్ ఎన్‌జీవో, పలు ప్రఖ్యాత సంస్థలకు అప్పగిస్తుంటారు. దేశరక్షణ కోసం పని చేసిన వీటిని సంరక్షణ కేంద్రాల్లో వదిలేయకుండా.. ప్రజలకు దత్తత ఇచ్చేందుకు సీఆర్పీఎఫ్ సిద్ధమైంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. దాదాపు 8 నుంచి 12 ఏళ్ల వయసున్న ఈ జాగిలాలు దేశ వ్యాప్తంగా నక్సల్ వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక సాహస కార్యకలాపాల్లోపాల్గొన్నాయి. అయితే.. వీటిని ఇతరులకు అప్పగించినట్లయితే దేశ వ్యతిరేక కార్యాలకు ఉపయోగిస్తారనే అనుమానాలు ఉండడంతో ఇన్నాళ్లూ దత్తతకు ఇవ్వలేదని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కానీ, ప్రస్తుతం వీటిని దత్తత తీసుకోవాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి.

# మీ ప్రేమకు సదా రుణపడి ఉంటా..

నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా, టెలివిజన్ ప్రెజెంటర్‌గా, నిర్మాతగా దశాబ్దాలుగా సక్సెస్‌ఫుల్‌గా ప్రయాణాన్ని కొనసాగిస్తున్న సీనియర్ యాక్టర్లలో ముందు వరుసలో ఉంటాడు సాయికుమార్. కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాలైతే.. కనిపించని ఆ నాలుగో సింహమే రా పోలీ స్.. ఈ పాపులర్ డైలాగ్ గుర్తుంది కదా.. పోలీస్ స్టోరీ సినిమాలోనిది. ఈ డైలాగ్‌ను సాయికుమార్ కాకుండా వేరే యాక్టర్ చెబితే అంతగా పాపులర్ అయ్యేది కాదేమో అంటే అతిశయోక్తి కాదు. ఒక్క డైలాగ్‌తో ఇండస్ట్రీని షేక్ చేశాడు సాయికుమార్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ ఇండస్ట్రీలో 50 ఏండ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నాడు. సాయికుమార్ దేవుడు చేసిన పెళ్లి సినిమాతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా సిల్వర్ స్క్రీన్‌పై ఎంట్రీ ఇచ్చాడు. ఈ సినిమా 1975 జనవరి 9న (ఇదే రోజు) రిలీజైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ అరుదైన జ్ఞాపకాన్ని సినీ ప్రేక్షకులు, అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకున్నాడు సాయికుమార్. ఆ సినిమాలోని స్టిల్‌ను షేర్ చేసుకుంటూ అద్భుతమైన ప్రయాణం మొదలై.. కొనసాగుతోంది.. అందరికీ ధన్యవాదాలు అనిసందేశాన్ని పోస్ట్ చేశాడు. 50 సంవత్సరాలు.. నా ప్రయాణంలో భాగమైన సినీ పరిశ్రమ లోని ప్రతి ఒక్కరికీ, నాకుటుంబానికి, నా ప్రేక్షకులకు చాలా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మీ అచంచలమైన ప్రేమ, మద్దతుకు నేను సదా రుణపడి ఉంటా నని ట్వీట్ చేశాడు సాయి కుమార్. కెరీర్‌లో ఉత్తమ విలన్ (సామాన్యుడు )గా, ఉత్తమ సహాయనటుడిగా (ప్రస్థానం) అవార్డులు అందుకోవడం తోపాటు ఎన్నో పురస్కారాలు అందుకున్న సాయి కుమార్ మరిన్ని విజయాలు అందుకోవాలని విష్ చేస్తున్నారు





గ్లామరస్ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్ అందం, అభినయం, ఫ్యాషన్‌కు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. ఆమె టాలెంట్ గురించి అందరికీ తెలుసు. ఇక సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ మెరుపులతో సందడి చేసే అమ్మడు మరోసారి వైరల్ గా మారింది. ఇటీవల ఆమె షేర్ చేసిన డిఫరెంట్ డ్రెస్‌లోని ఫోటోలు సోషల్ మీడియాలో హీట్ పెంచాయి. ఫ్లోరల్ డిజైన్‌లతో ఆకట్టుకునే ఈ అవుట్‌ఫిట్ ఆమెను మరింత ఆకర్షణీయంగా చూపించింది. లెహంగాలోని రంగుల హార్మనీకి ఆమె చిరునవ్వు జతకలిసి ఫోటోషూట్‌కి ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకువచ్చింది. ప్రత్యేకంగా ఎంచుకున్న ఆభరణాలు, క్లాసిక్ హెయిర్‌స్టైల్‌తో ఈ లుక్ మైలేజ్ అందుకుంది. ప్రగ్యా కంచె చిత్రంతో తెలుగు సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఆ సినిమా విజయం తర్వాత ఆమెకు భారీ అవకాశాలు వచ్చాయి. జయ జానకి నాయక లోని ఆమె పాత్ర ఎంతో హైలైట్ అయ్యింది. తర్వాత వచ్చిన "అఖండ" చిత్రంలో బాలకృష్ణ సరసన ఆమె పాత్ర ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. ఆ సినిమాతో ప్రగ్యా స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ దక్కించుకుంది. కానీ తర్వాతి ప్రాజెక్టుల్లో అంతగా కనిపించకపోవడం అభిమానులను నిరాశపరిచింది. ఇప్పుడామె దృష్టి మొత్తం ఫ్యాషన్ మీదే. ప్రముఖ డిజైనర్ల ఔట్‌ఫిట్లను ధరించి రెగ్యులర్‌గా ఫోటోషూట్లు చేస్తూ అభిమానులకు టచ్‌లో ఉంటోంది. ఈ మధ్యకాలంలో బ్రౌన్ నెట్ గౌన్, లహంగాల్లోని ఫోటోషూట్ల ద్వారా ఆమె తన స్టైల్ స్టేట్మెంట్‌ను మరింత బలపరచుకుంటోంది. "డాకూ మహారాజ్" ప్రొమోషన్స్ కోసం ఆమె షేర్ చేసిన తాజా ఫోటోలు మరోసారి ఆమె గ్లామర్‌ను సుస్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ ఫోటోలకు నెటిజన్లు భారీగా లైక్స్ మరియు కామెంట్లు పెడుతున్నారు.

## క్లాసిక్‌గా ప్రగ్యా

# గాంధీ తాత చెట్టు ట్రైలర్ విడుదల

సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థల సంయుక్త నిర్మాణంలో తెరకెక్కిన సినిమా 'గాంధీ తాత చెట్టు'పై సినీ ప్రపంచంలో మంచి ఆసక్తి నెలకొంది. జాతీయ అవార్డులు గెలుచుకున్న దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ. అప్పుడెప్పుడో 100% లవ్ స్టోరీలో హీరోయిన్ ఇంట్రో షాట్ లో పసిపాపగా కనిపించిన సుకృతి మళ్ళీ ఇప్పుడు ఒక డిఫరెంట్ ఏమోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలో నటించడం విశేషం. ఇటీవలే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లలో ప్రదర్శించబడి ప్రశంసలు అందుకుంది. జనవరి 24న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, సూపర్‌స్టార్ మహేష్‌బాబు సోషల్ మీడియాలో ట్రైలర్‌ను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. ట్రైలర్ విషయానికి వస్తే, గాంధీ సిద్ధాంతాలను అనుసరించే పదమూడేళ్ల అమ్మాయి తన గ్రామాన్ని రక్షించడానికి చేసే ప్రయాణం ఈ కథాంశం అని తెలుస్తుంది. సుకృతి ఇందులో నిజంగా గుండులో కనిపించడం మరో ఆసక్తికరమైన విషయం. సుకృతి వేణి తన సహజ అభినయంతో ఆ పాత్రను ప్రాణం పోసింది. ట్రైలర్ హృదయాన్ని హత్తుకునే సన్నివేశాలతో నిండిఉంది. ఈ సందర్భంగా మహేష్‌బాబు తన ట్విట్టర్‌లో "ఇది అందరి హృదయాలను హత్తుకునే సినిమా, గాంధీ తాత చెట్టు ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. సుకృతికి, ఈ సినిమా టీమ్ అందరికి నా అభినందనలు" అంటూ ప్రశంసలు కురిపించారు. నిర్మాతలు, దర్శకురాలు పద్మావతి మల్లాది సూపర్‌స్టార్ మహేష్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. దర్శకురాలు పద్మావతి మల్లాది మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచంలో నెగటివిటీ పెరిగిపోతున్న తరుణంలో, గాంధీ గారి సిద్ధాంతాలను ఈ తరం పిల్లలకు పరిచయం చేయడం ఎంత ముఖ్యమో వివరించడం జరిగింది. అహింస, శాంతి సిద్ధాంతాలను గాఢంగా ఆకళింపు చేసుకున్న ఓ చిన్నారి తన గ్రామం కోసం చేసిన ప్రయత్నాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు లోనుచేస్తాయని ఆమె తెలిపారు. ఇక జనవరి 24న ఈ చిత్రం విడుదల కానున్నట్లు తెలియజేశారు.



# సిర్ఫ్ లగే మెహెంగా' క్యాంపెయిన్‌ను ప్రారంభించిన టాటా ప్లే

హైదరాబాద్

భారతదేశంలోని ప్రముఖ డైరెక్ట్ టు హెూమ్ ప్రొవైడర్ టాటా ప్లే, కొత్త ఏడాది, పంటల, పండగల సీజన్‌ను పురస్కరించుకుని 'సిర్ఫ్ లగే మెహెంగా' (అనుకునేందుకే ధర ఎక్కువ) కేవలం అనే సరికొత్త క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. కుటుంబం లోని ప్రతి సభ్యుని ఎంపికలకు అనుగుణంగా, వినోదం, వార్తలు, క్రీడలు, సంగీతం, సినిమాలు, భక్తి, కిడ్స్, తదితర కళా ప్రక్రియలతో సహా విస్తృతమైన, బడ్జెట్-ఫ్రెండ్లీ, అధిక నాణ్యతతో కూడిన వినోద అనుభవాన్ని టాటా ప్లే తెలుగు సూపర్ వాల్యూ ప్యాక్ అందిస్తుంది.

ఓగిల్వీ తెరకెక్కించిన 'సిర్ఫ్ లగే మెహెంగా' క్యాపెయిన్‌ను డీటీహెచ్ సేవలు ఖరీదైనవి అనే అపోహను హాస్యాస్పదంగా తొలగించే ఓవర్ స్టేట్‌మెంట్ పేరడీ చిత్రాల శ్రేణిని ప్రదర్శిస్తుంది. టాటా ప్లే ప్రపంచ స్థాయి వినోదాన్ని సరసమైన ధరకు ఎలా అందజేస్తుందో, రాజీలేని వీక్షణ అనుభవాన్ని ఎలా అందజేస్తుందో ఈ వాణిజ్య ప్రచార చిత్రాలు హైలైట్ చేస్తాయి.

